

బడులకు నిధులు

సర్కారు బడుల నిర్వహణకు తొలివిడత నిధులు మంజూరయ్యాయి. నిధులు ఖాతాల్లో జమ కావడంతో ప్రధానోపాధ్యాయులకు భారం తప్పింది. 8లో▸



యాసంగి ఆశలు.. 9లో▸

సరస్వతీ కాలువ కింద పంటల సాగు చేస్తున్న రైతులకు యాసంగి సాగుపైన భరోసా కలిగింది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టంతో నిండి ఉంది.

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నూతన ఏటీఎం



ఏటీఎంను ప్రారంభిస్తున్న అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్ ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఏటీఎం కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బ్యాంకు అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఈ ఏటీఎం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె



డిపో ఎదుట అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన..

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు సోమవారం సమ్మెబాట పట్టారు. ఈ సందర్భంగా డిపో ఎదుట నిరసన తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్ల అగ్రిమెంట్ ఈనెల 22న ముగిసిందని, నూతన అగ్రిమెంటు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. నూతన అగ్రిమెంట్‌లో ఎక్స్‌ప్రెస్ సర్వీస్ డ్రైవర్‌కు నెలకు రూ.22,500, పల్లె వెలుగు సర్వీస్ డ్రైవర్‌కు రూ.21,500 వేతనం ఇవ్వాలన్నారు. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, నైట్ హాల్ట్ సర్వీస్ డ్రైవర్లకు నెలకు రూ.24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే యాజమాన్యం యూనియన్ నాయకులను చర్చలకు పిలిచింది. నూతన ఒప్పందానికి యాజమాన్యం సమయం అడగడంతో అద్దె బస్సు డ్రైవర్లు తాత్కాలికంగా సమ్మెను విరమించి విధుల్లో చేరారు. నిరసనలో యూనియన్ నాయకులు మసురుద్దీన్, షాఫుల్లాఖాన్, వకీల్, సతీశ్‌కుమార్, మల్లేశ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలని వినతి


కుభీర్: మండలంలోని సొనారి పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్తులు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 8 తరగతులు, 112 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ముగ్గురు టీచర్లలో శివప్రసాద్ అనే ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారని, ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా ఉంటూ అప్పుడప్పుడు పాఠశాలకు వస్తారని, చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయుడు మాత్రమే 8 తరగతులకు బోధిస్తున్నాడని తెలిపారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం డీఈవో రవీందర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. మల్లారెడ్డి, నారాయణ, విఠల్, గోకుల్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ భవన నిర్మాణానికి భూమిపూజ

నిర్మల్ రూరల్: నిర్మల్ రూరల్ మండలం ఎల్లపెల్లి గ్రామ శివారులో డీఎస్పీ భవన నిర్మాణానికి ఎస్పీ జానకీషర్మిల సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ భవనం నిర్మాణంలో ఉందని, డీఎస్పీ, ఆర్ఎస్సై, కానిస్టేబుల్ క్వార్టర్స్ భవనాల పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ నిరీక్షణకు తెర!?

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలు
- కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఆదాయ పరిమితి నిబంధనపై ఆందోళన
- అక్టోబర్ 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ



కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో ఇప్పటికే పలు దఫాలుగా పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. అక్టోబర్ 2 నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం అందించే ఏ పథకం అందాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. రేషన్ కార్డు లేని వారికి అర్హతలున్నా.. పథకాలు వర్తించడం లేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వీటిని ఇప్పుడున్న కార్డుల తరహాలో కాకుండా స్మార్ట్ కార్డుల రూపంలో జారీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. రేషన్ కావాల్సిన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు, రేషన్ తీసుకోని వారికి స్మార్ట్ హెల్త్ కార్డుల రూపంలో మంజూరు చేస్తారు. వీటి కోసం వచ్చే నెల 2 నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో విధివిధానాలు ఖరారు చేస్తే కానీ ఎవరెవరు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులనేది తేలనుంది.

2021లో దరఖాస్తుల స్వీకరణ..

ఆహార భద్రత కార్డులో నమోదైన ప్రతీ వ్యక్తికి ఆరు కేజీల చొప్పున, అంత్యోదయ కార్డు కుటుంబానికి 35 కేజీలు, అన్నపూర్ణ కార్డు ద్వారా ఒక్కో సభ్యుడికి 10 కేజీల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2020 కరోనా నుంచి ఉచితంగా బియ్యం సరఫరా చేస్తున్నాయి. మరోవైపు ప్రతీ పథకానికి రేషన్ కార్డులు ప్రామాణికం కావడంతో ప్రతినెలా దరఖాస్తులు చేసుకునే వారుంటున్నారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. కేవలం మార్పులకు అవకాశం కల్పించింది. అప్పుడు జిల్లాలో మొత్తం 2,08,459 కార్డులు ఉన్నాయి. కొత్తగా 2021లో అర్హులకు మాత్రమే తాత్కాలిక కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించగా 15,185 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అర్హులా? కాదా? అని పరిశీలించారు. ఆధార్ ఆధారంగా ఆస్తులు, వాహనాలు, ఆదాయపన్ను వివరాలు సేకరించారు. పరిశీలనలో వివిధ కారణాలతో 1,965 దరఖాస్తులను తిరస్కరించి 13,220 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి కూడా కార్డులు జారీ చేయలేదు.

కీలకంగా మారిన రేషన్ కార్డు..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందాలంటే లబ్ధిదారులకు రేషన్ కార్డు తప్పనిసరిగా మారింది. నిన్నటి వరకు సాగిన రైతు రుణమాఫీ పథకం మొదలుకుంటే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, మహిళలకు ప్రతినెలా రూ.2,500, యువ వికాసం, గృహలక్ష్మి తదితర పథకాల వరకు అన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికంగా మారింది. దీంతో ప్రభుత్వ ప్రకటన వెలువడటమే తరువాయి దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా.. రేషన్ కార్డుల జారీకి గతంలో గ్రామీణ, అర్బన్ ఏరియాలుగా వార్షిక ఆదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డులు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, అర్బన్ రూ.2 లక్షల్లోపు ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకున్నారు. భూవిస్తీర్ణం తరి భూమి అయితే 3.5 ఎకరాలు, మెట్ట అయితే 7.5 ఎకరాలలోపు ఉండాలనే నిబంధనలు అమలు చేశారు. ఇప్పుడవే నిబంధనలు చేస్తారా? కొత్త మార్గదర్శకాలు నిర్దేశిస్తారా? అన్న అంశాలపై కూడా త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు ఎలా ఉంటాయో..

ప్రస్తుతం తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారుల్లో ప్రభుత్వ ప్రకటనతో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటి వరకు లబ్ధిదారుల వద్ద అంత్యోదయ, ఆహార భద్రత, అన్నపూర్ణ కార్డులున్నాయి. ప్రభుత్వం మాత్రం స్మార్ట్ కార్డులను జారీ చేస్తామని తెలిపింది. రేషన్ కావాలిస్న వారికి స్మార్ట్ రేషన్ కార్డులు, అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్ కార్డులు మంజూరవుతాయి. మరోవైపు వార్షిక ఆదాయాన్ని కూడా సవరిస్తారని తెలుస్తోంది. వీటిని పరిశీలిస్తే కొత్తగా జారీ చేసేవి మాత్రమే స్మార్ట్ కార్డులుగా ఉంటాయా..? లేక అందరికీ అవే ఇస్తారా అనేది ఇంకా తేలలేదు. ఇక వార్షిక ఆదాయాన్ని ఎంతకు పరిమితం చేస్తారనేది కూడా విధి విధానాల్లో ప్రకటించే అవకాశం ఉంది.

జిల్లా వివరాలు..	
జిల్లాలోని గ్రామ పంచాయతీలు	400
మున్సిపాలిటీలు	03
రేషన్ షాపులు	412
అంత్యోదయ కార్డులు	12,829
ఆహార భద్రత కార్డులు	1,95,598
అన్నపూర్ణ కార్డులు	32
మొత్తం కార్డులు	2,08,459
మొత్తం యూనిట్లు	6,40,837
ఇప్పటికే వచ్చిన దరఖాస్తులు..	
మెంబర్ యాడింగ్‌కు	17,589
యూనిట్లు	25,062
అనుమతించినవి	17,444
తిరస్కరించినవి	145

ప్రజాసమస్యలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్లు తదితర సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చాయి. అర్జీలు స్వీకరించి సమస్య తెలుసుకున్న కలెక్టర్ వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదల కోసం ప్రారంభించిన బాలశక్తి కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలి..

భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.

రోడ్డు మరమ్మతు చేయించాలి..

జిల్లా కేంద్రంలోని 39వ వార్డులో మిషన్ భగీరథ పనుల కారణంగా రోడ్డు పూర్తిగా దెబ్బతిందని అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

టీచర్లని నియమించాలి..

భోసి జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కలిపి మొత్తం 460 మంది విద్యార్థులు ఉన్నారని, ఉపాధ్యాయులు మాత్రం కేవలం 13 మందే ఉన్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం టీచర్లను నియమించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు పెంచాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్పీ కార్యాలయంలో వినాయక నిమజ్జనం



పూజలు చేస్తున్న ఎస్పీ జానకీషర్మిల, డీఎస్పీ



శోభాయాత్రలో పాల్గొన్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నెలకొల్పిన వినాయక నిమజ్జన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జానకీ షర్మిల వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణేశ్ శోభాయాత్రను సంప్రదాయ పద్ధతిలో మేళా తాళాలతో క్యాంప్ కార్యాలయం నుంచి ఎస్పీ ప్రారంభించి, పోలీస్ సిబ్బందితో స్థానిక బంగల్‌పేట్ చెరువు వరకు వెళ్లి నిమజ్జనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో సోదర భావంతో ఉండాలని కోరారు. ఈనెల 7న ప్రారంభమైన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలందరూ సహకరించారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే దుర్గమాత నవరాత్రి ఉత్సవాలను కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. భైంసా ఏఎస్పీ అవినాష్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, సోన్ సీఐ నవీన్‌కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. కొలువు కొట్టారు..!

- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొలువులు సాధించిన జిల్లా యువకులు
- బాసర జోన్‌లో 1, 15 ఉద్యోగాలు జిల్లా వాసులకే



బాసర జోన్ ఫస్ట్ ర్యాంకర్ తక్కాయి శ్రీనివాస్



15వ స్థానం పొందిన అంకం శ్రీధర్

నిర్మల్‌ఖిల్లా: వారు కష్టాన్ని ఇష్టపడ్డారు... ఏళ్లుగా పుస్తకాలకే పరిమితమయ్యారు.. తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక్కోమెట్టు ఎక్కుతున్నారు. ఇటీవల విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాలలో ఒకరు బాసర జోన్‌లోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, మరొకరు 15వ స్థానంలో నిలిచారు. పట్టుదల, క్రమబద్ధమైన ప్రణాళిక ఉంటే ఆశించిన లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చని చెబుతున్నారు.

గ్రూప్–1 లక్ష్యంగా...

ప్రస్తుతం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లో నివాసముంటున్న తక్కాయి శ్రీనివాస్ కొన్నేళ్లుగా గ్రూప్–1పై గురిపెట్టాడు. ఇదే క్రమంలో టీజీపీఎస్సీ ద్వారా వెలువడుతున్న నోటిఫికేషన్‌లకు సన్నద్ధమవుతున్నాడు. లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ 2006 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై ముధోల్ మండలం చింతకుంట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే గ్రూప్–1 సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రస్తుతం చేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. రెండేళ్లుగా గ్రంథాలయానికి పరిమితం అయ్యారు. ఈ క్రమంలోనే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి కూడా దరఖాస్తు చేసుకుని ప్రిపేర్ అయ్యాడు. ఇటీవల టీజీపీఎస్సీ వెలువరించిన ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచి, 203.96 మార్కులతో జోన్–2లో మొదటి స్థానాన్ని, రాష్ట్రస్థాయిలో 61వ స్థానాన్ని పొందాడు. ఇదివరకే గ్రూప్–1 ప్రిలిమ్స్ అర్హత సాధించి మెయిన్స్ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ ఫలితాలు మంచి ప్రేరణ అందించాయని తెలిపారు.

పట్టుబట్టి..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీకి చెందిన 'అంకం శ్రీధర్' 195.93 మార్కులతో బాసర జోన్ పరిధిలో 15వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 183వ ర్యాంకు సాధించారు. తన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు నాలుగేళ్లుగా గ్రంథాలయాల్లో సన్నద్ధమవుతున్నాడు. పాఠశాల విద్యను వద్యాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ డిగ్రీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశాడు. పీజీ బీఎడ్ కాకతీయ విశ్వవిద్యాలయంలో చదివిన శ్రీధర్ తాజాగా వెల్లడైనా ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొలువు కొట్టారు.

మాకొద్దీ ఇథనాల్ ఫ్యాక్టరీ..!

- కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ ఆధ్వర్యంలో సమావేశం
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాట్లపై రైతుల అసహనం



సమావేశానికి హాజరైన రైతులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ రైతులు మరోమారు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దిలావర్‌పూర్ రైతు వేదికలో తహసీల్దార్ స్వాతి సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మొదటగా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు రైతులకు ఫ్యాక్టరీ ఎలాంటి విష వాయువులు, కలుషిత నీటిని, పర్యావరణానికి హాని కలుగకుండా ఉందంటూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేయడానికి భారీ తెర, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేయగా వాటిని తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు వాటిని తీసుకుని అక్కడ నుండి వెళ్లిపోయారు. అనంతరం సమావేశంలో తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా పలువురు రైతులు తహసీల్దార్ మాటలపైనా అసహనం వ్యక్తం చేశారు. ఎవరూ మాట్లాడవద్దని, ఇటీవల వివిధ ప్రాంతాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీలను సందర్శించి వచ్చిన రైతులు మాట్లాడాలని ఒక్కో రైతులను లేపగా రైతులు తాము చూసిన వాస్తవాలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులను భయపెట్టేలా మాట్లాడొద్దని గుండంపల్లి గ్రామానికి చెందిన ఎల్లాల చిన్నారెడ్డి, దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన నాలం వెంకటరమణ, పాల్దె శ్రీనివాస్ సూచించారు. పలు ఫ్యాక్టరీల పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలు ఇబ్బంది పడడాన్ని తాము స్వయంగా చూశామని తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆర్డీవో కార్యాలయం ముట్టడి



బైఠాయించిన లబ్ధిదారులు

భైంసాటౌన్: పట్టణశివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లు కేటాయించి ఏడాదిన్నర కావస్తున్నా.. సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. అద్దె ఇళ్లలో కిరాయిలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డబుల్‌బెడ్రూం ఇళ్లు అప్పగించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



శ్రీహర్షిత్

నిర్మల్‌టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 29న నిర్మల్‌లో నిర్వహించిన అండర్–14 బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి, గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి గోనె శ్రీహర్షిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంచిర్యాలలో జరిగిన జోనల్ గేమ్స్‌లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

పెరిగిన అడెల్లి మహాపోచమ్మ ఆదాయం



డబ్బులు లెక్కిస్తున్న మహిళలు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయంలోని 11 హుండీలను దేవాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమొగిలి ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. నగదు రూ.40,69,281 రాగా, మిశ్రమ బంగారం 235 గ్రాములు, మిశ్రమ వెండి 4.8 కిలోలు సమకూరినట్లు రాజమొగిలి తెలిపారు. గతేడాది హుండీ ఆదాయం 28,33,000 రాగా, ఈసారి ఆదాయం రెట్టింపయినట్లు పేర్కొన్నారు. బంగారు, వెండి ఆభరణాల సమర్పణ విషయంలోనూ భక్తులు ఈసారి అమ్మవారిపై విశ్వాసం పెంచుకున్నారు. కార్యక్రమంలో ఈవో రమేశ్, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, కౌట్ల, అడెల్లి, స్వర్ణ, సారంగాపూర్ గ్రామాలకు చెందిన మహిళా భక్తులు పాల్గొన్నారు.

కాగుతున్న వంట నూనెలు

- పండుగ వేళ సుంకం పెంచిన కేంద్రం
- దీంతో ధరలు పెంచిన రిటైల్ వ్యాపారులు
- లీటరుపై రూ.20 నుంచి రూ.30 వరకు పెరుగుదల



నిర్మల్‌ఖిల్లా: ప్రతీ వంటకంలో ప్రధానంగా అవసరమయ్యే వంటనూనెలు పొయ్యి వెలిగించకుండానే సలసల కాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై 20 శాతం సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో నూనెల ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్నంటడంతో ఇబ్బందిపడుతున్న సామాన్య ప్రజలకు ఈ నిర్ణయంతో బెంబేలెత్తిపోతున్నారు. తెలంగాణలో ముఖ్యమైన పండుగ బతుకమ్మ, దసరా పండుగ వేళ దిగుమతి చేసుకుంటున్న పొద్దుతిరుగుడు , పామాయిల్ నూనెలపై కేంద్రం సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకొంది. ఇప్పటి వరకు బహిరంగ మార్కెట్లో లీటరుకు రూ.110 అమ్మిన పొద్దుతిరుగుడు నూనెను ఒక్కసారిగా రూ.130 కు పెంచేశారు. రూ.90 ఉన్న పామాయిల్ రూ.120 కు పెంచి విక్రయిస్తున్నారు.

సామాన్యులపై మరింత భారం..

ఇప్పటికే నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో అదనంగా ఇప్పుడు వంట నూనెల ధరలు కూడా 20 నుంచి 30 శాతం అధికమవడంతో సామాన్యులపై మరింత భారం పడింది. పది రోజుల క్రితం 15 లీటర్ల నూనె డబ్బా రూ.1,520 ఉండగా అదే రూ.1,830 కి చేరింది. వివిధ రకాల వంటనూనెలను,కంపెనీలను బట్టి లీటరుపై రూ.25 నుంచి రూ.30 వరకు ధరలు పెరిగాయి. 5 లీటర్ల డబ్బాపై రూ.150 , 15 లీటర్ల డబ్బాపై రూ.350 వరకు ధరలు పెరిగాయి.

కృత్రిమ కొరత?

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచుతున్నట్లు ప్రకటించగానే పంపిణీదారులు డిస్ట్రిబ్యూటర్లు ఏకంగా నూనె ధరలను పెంచేశారు. సుంకం పెంచడంతోనే ధరలను పెంచుతున్నట్లు చెబుతున్న టోకు వ్యాపారులపై పర్యవేక్షణ చేసే అధికారు జిల్లాలో కరువయ్యారు. గతంలో పౌరసరఫరాల అధికారులు అత్యవసర సరకుల చట్టం కింద అడ్డగోలుగా ధరలు పెంచకుండా నియంత్రించేవారు. ప్రస్తుతం స్వేచ్ఛ వాణిజ్యం రావడంతో వారిపై అజమాయిషీ కరువైందని అంటున్నారు. కొంతమంది పంపిణీదారులు వారి వద్ద ఉన్న నిల్వలను దాచి.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.

వినూత్న ప్రచారం!



ఆరు గ్యారంటీలపై రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రచారం చేస్తోంది. ఈ మేరకు నిత్యం వందలాది మంది వచ్చే నిర్మల్ కలెక్టరేట్‌లో సంక్షేమ పథకాలను వివరించేలా బెలూన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే భారీ బెలూన్‌ను కలెక్టరేట్ పైభాగంలో ఎగురవేశారు. తాజాగా సబ్సిడీ గ్యాస్ పథకాన్ని వివరించేలా సిలిండర్ రూపంలో ఉన్న బెలూన్‌ను కలెక్టర్ చాంబర్ వైపు వెళ్లే దారిలో ఏర్పాటు చేశారు. ఈ బెలూన్‌పై ఆరు గ్యారంటీలతో ఇందిరాగాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉన్నాయి. కాగా, ఇన్నాళ్లు బెలూన్లలో ఆక్సిజన్ నింపుతుండగా.. విద్యుత్ కనెక్షన్‌తో రూపం సంతరించుకునే సిలిండర్ బెలూన్‌ను కలెక్టరేట్‌కు వచ్చేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

బడులకు నిధులొచ్చినయ్..

- తొలి విడత నిర్వహణ నిధులు మంజూరు
- ప్రత్యేకంగా క్రీడా నిధులు కూడా
- పాఠశాలల ఖాతాల్లో జమ
- హెచ్ఎంలకు తప్పనున్న భారం



మంచిర్యాల జెడ్పీ బాలుర పాఠశాల

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన తొలివిడత నిధులు మంజూరయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిర్వహణ నిధులు(స్కూల్ గ్రాంటు), స్పోర్ట్స్ గ్రాంటు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పాఠశాలలు పున:ప్రారంభమైన మూడు నెలలు గడిచిపోయినా పాఠశాల నిర్వహణ నిధులు రాకపోవడంతో హెచ్ఎంలు ఇబ్బందులు పడ్డారు. తరగతి గదిలో అవసరమైన చాక్‌పీస్, స్టేషనరీ, హాజరుపట్టిక పుస్తకాలతోపాటు ఏదైనా కొనుగోలు చేయాలంటే హెచ్ఎంలే సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో తొలివిడత నిర్వహణ 50 శాతం నిధులు పాఠశాలల ఖాతాలకు నేరుగా విడుదల కావడంతో ఊరటనిస్తోంది.

నిధులు మంజూరు ఇలా..

ప్రతిఏటా పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక గ్రాంట్లు మంజూరవుతాయి. 1 నుంచి 30 వరకు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 వరకు రూ.25 వేలు, 101 నుంచి 250 లోపు రూ.50 వేలు, 251 నుంచి 1000 మంది వరకు రూ.75 వేలు, వెయ్యికిపైగా ఉంటే రూ.లక్ష చొప్పున నిధులిస్తారు. ఈ నిధులతో మరుగుదొడ్ల క్లీనింగ్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు, విద్యుత్, తాగునీరు, మరమ్మతు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కలు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. జాతీయ పండుగల నిర్వహణ, కంప్యూటర్లు, ప్రాజెక్టర్ల నిర్వహణ, ఇంటర్నెట్, డిజిటల్ తరగతుల వరకు ఈ నిధులను వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలివిడతలో 50శాతం నిధులు

జిల్లాలు	స్కూళ్ల సంఖ్య	స్కూల్‌గ్రాంటు(రూ.లు)	స్పోర్ట్స్ నిధులు(రూ.లు)	మొత్తం (రూ.లు)
ఆదిలాబాద్	1168	1,35,37,500	47,82,500	1,83,20000
మంచిర్యాల	760	85,30,000	34,45,000	1,19,75,000
నిర్మల్	762	1,00,67,500	34,75,000	1,35,42,500
ఆసిఫాబాద్	1018	1,09,07,500	38,12,500	1,47,20,000

క్రీడా నిధులు కూడా..

ప్రభుత్వ బడులకు విద్యాశాఖ ప్రత్యేకంగా క్రీడా నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతానికి 50 శాతం నిధులను పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎస్సీ, ఎస్టీ, జనరల్ కాంపొనెంట్ కింద మంజూరు చేశారు. ఈ నిధులను పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిని బట్టి పరికరాలు కొనుగోలు చేయడం, పిల్లలకు నైపుణ్యాలు వివరిస్తూనే పోటీలకు సన్నద్ధం చేయడం, తదితర అవసరాలకు ఉపయోగించాలి. ఏయే పరికరాలు ఎంతెంత వెచ్చించాలనే విషయాలను అధికారులు పొందుపర్చారు.

పరికరాలు కొనుగోలు ఇలా..

ప్రాథమిక స్థాయిలో క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.5 వేలు కేటాయించారు. క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్, చిన్న సైజు సాఫ్ట్‌బాల్, టెన్నిస్ బాల్, ప్లాస్టిక్ బాల్స్, ఫుట్‌బాల్స్, బాస్కెట్ బాల్స్, రబ్బీ సాఫ్ట్ బాల్ పలు క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.10 వేలు, ఉన్నత పాఠశాలల క్రీడలకు రూ.25 వేలు చొప్పున కేటాయించారు. రబ్బర్ షాట్‌పుట్లు, స్కిప్పింగ్, రోప్, క్రికెట్ బ్యాట్లు, టెన్నిస్ బాల్, నెట్, హ్యాండ్ బాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, పెద్ద గోల్ఫ్ కోర్స్, ప్రాథమిక చికిత్స పెట్టె, సాసర్ కోన్, నిచ్చెన, ఇతర క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలి.

హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థి

- జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఘటన
- సమాచారంతో పట్టుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు


విద్యార్థిని హాస్టల్ సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్: హాస్టల్ నుంచి విద్యార్థి పారిపోయిన ఘటన పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఎస్సై రాహుల్ కథనం ప్రకారం.. కడెం మండలం కొండుకూరు గ్రామానికి చెందిన నిక్షిత్ 5వ తరగతి చదువుతున్నాడు. అతనికి చదువుకోవడం ఇష్టం లేకపోవడం, ఇంటిపై బెంగతో ఆదివారం రాత్రి హాస్టల్ నుంచి పారిపోయాడు. పరిసరాల్లో తిరుగుతున్న విద్యార్థిని ఓ వ్యక్తి గమనించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంతోశ్, సుధీర్ అక్కడికి వెళ్లి విద్యార్థిని పట్టుకుని తిరిగి హాస్టల్ సిబ్బందికి అప్పగించారు.

మహిళల్లో చైతన్యం కోసమే ఇందిరా ఫెలోషిప్



అవగాహన కల్పిస్తున్న ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌రూరల్: మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా యూనిట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. మావల మండల కేంద్రంలో ఫెలోషిప్ సభ్యులకు సోమవారం బూట్ క్యాంప్ వర్క్‌షాప్ నిర్వహించారు. రాజకీయాల్లో మహిళల పాత్ర, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి అభియాన్‌లో భాగంగా ఉమెన్ ఎంపవరింగ్, ట్రాన్స్‌ఫార్మింగ్ పాలిటిక్స్ అనే లక్ష్యంతో ఇందిరా ఫెలోషిప్ సంస్థను రాహుల్‌గాంధీ ఆలోచనతో వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నివర్గాల మహిళలను ఎంపిక చేసుకుని వారికి ఇందిరా ఫెలోషిప్ పేరిట ఆర్థిక సహకారం అందిస్తామన్నారు.తెలంగాణ కోఆర్డినేట్ శివలాల్ నేతికల్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నగేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విషజ్వరంతో బాలిక మృతి


దీక్షిత (ఫైల్)

లక్సెట్టిపేట: విషజ్వరంతో బాలిక మృతి చెందింది. మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దీక్షిత (12) కొన్నిరోజులుగా విషజ్వరంతో బాధపడుతుంది. కుటుంబీకులు..పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రెండు రోజుల క్రితం జ్వరం ఎక్కువ కావడంతో వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేయగా అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. కుమార్తె మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, దీక్షిత.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది.

మెట్ల పైనుంచి పడి ఒకరు..

నేరడిగొండ: మండల కేంద్రంలో ఓ యువకుడు ఇంటి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బోగే అశోక్ (38) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు మద్యం సేవించేవాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత మెట్లు ఎక్కుతుండగా పైనుంచి జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆటోలో పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు. తల్లి నర్సమ్మ ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రైలు ఎక్కబోయి జారిపడి వ్యక్తి..

బాసర: మద్యం మత్తులో వ్యక్తి రైలు ఎక్కబోయి జారిపడి మృతిచెందాడు. బాసర రైల్వేస్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం సిరిపల్లికి చెందిన రావుసాబ్, సరిత దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు కృష్ణ (8), లక్కి(5). భార్యభర్తలు కూలీ పనిచేసుకుని జీవిస్తున్నారు. సోమవారం కూలీ పనికోసం మహారాష్ట్రలోని పండర్‌పూర్ వెళ్లేందుకు బాసర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రావుసాబ్.. పండర్‌పూర్ రైలు ఎక్కుతుండగా జారి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీ సులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో వ్యభిచారం గృహంపై సోమవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆ కాలనీలో గల ఓ ఇంట్లో మహిళ వ్యభిచారం నడిపిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. మహిళతోపాటు ముగ్గురు విటులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.3200 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/–ఇస్తాము. Contact Numbers: 9948000371, 9948000373 [H-1241126]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185451]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఉట్నూర్, జాతర్ల క్రీడా పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభకనబర్చారు. అండర్–14 విభాగంలో అథ్లెటిక్స్‌లో రాథోడ్ కార్తీక్‌కు (బంగారు), హెరకుమ్ర నగేశ్‌కు (కాంస్య), అండర్ 14–లో కిడ్స్ జావెలిన్ త్రోలో కోట్నాక్ జాకేశ్‌కు (కాంస్య), 60 మీ.ల పరుగులో రాథోడ్ విక్రమ్‌కు (కాంస్య), అండర్–16లో జావెలిన్‌త్రోలో పెందూర్ సతీశ్‌కుమార్ (కాంస్య) పతకాలు దక్కించుకున్నారు. వారితోపాటు కోచ్ జి.సునంద్‌లను ఏసీఎంవో అర్క జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అభినందించారు. కార్యక్రమంలో పీడీ జాదవ్‌మేమంత్, కోచ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో గిరిజనుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌వో కుడిమెత మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ సవంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, సిబ్బంది పాల్గొన్నారు.

- తన పైచదువుల కోసం ఆర్థికసాయం అందించాలని ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన వైష్ణవి అర్జీ అందించింది.
- తనకు ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలంవడ్గాం గ్రామానికి చెందిన సునీత వేడుకుంది.
- ఉట్నూర్ మండలం మారుతీగూడకు మినీ అంగన్‌వాడీ మంజూరు చేయాలని జంగుబాయి విన్నవించింది.
- తన పంట భూమికి పట్టా ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన కోవ హన్మంత్‌రావు అర్జీ అందించాడు.

'ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విద్రోహులను నిలదీయండి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్దకు వచ్చే ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విద్రోహులను నిలదీయడమే కాకుండా తరిమికొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ సోమవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. లాభాల వాటా పంపకంలో పెరిగిన ఒక్క శాతంపై ఇది తమ ఘనత అంటూ కార్మికులను మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా 20శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


డి.ప్రేమ్‌దీప్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన డి. ప్రేమ్‌దీప్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. హర్యానా రాష్ట్రం రోతక్ జిల్లాలో ఈనెల 25 నుంచి 29 వరకు జరగబోయే 43వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి ప్రేమ్‌దీప్ పాల్గొంటారని వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నరసింగం తదితరులు ఈ సందర్భంగా ప్రేమ్‌దీప్‌ను అభినందించారు. సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన ఈయన జాతీయ పోటీల్లో సత్తాచాటాలని పలువురు ఆకాంక్షించారు.

హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే


కోడ్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి కార్మిక కోడ్ పత్రాలను దహనం చేశారు. హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను 4 కోడ్‌లుగా మార్చడాన్ని అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్రం కార్మికుల హక్కులు హరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ బ్లాక్ డేగా నిరసన చేపట్టామని తెలిపారు. లాభాల వాటాలో నికర లాభంపై 33 శాతం ఇవ్వాల్సి ఉండగా, సంస్థ అభివృద్ధికి రూ.2200 కోట్లు తీసుకుని రూ.2490 కోట్లలో వాటా ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శన్, నాయకులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, థామస్, ప్రభాకర్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

'లాభాలపై తప్పుడు ప్రచారం'


మాట్లాడుతున్న ముస్కే సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ సాధించిన లాభాలు, వాటాపై కొన్ని సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య మండిపడ్డారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం సంస్థ సాధించిన లాభాల నుంచి ఏ విధంగా వాటా చెల్లిస్తున్నారో ఈసారి కూడా అదేవిధంగా చెల్లించనున్నారన్నారు. నికర లాభం మీదనే ప్రతిసారి కార్మికులకు వాటా పంపిణీ చేస్తారని తెలిపారు. గడిచిన రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ నాయకులకు అవగాహన ఉండి కూడా ఇలా మాట్లాడడం సరికాదన్నారు. ఈసారి తాము అదనంగా ఒక శాతం పెంచి ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ సెక్రెటరీ గురిగంటే నర్సింగరావు, చల్ల తిరుపతి, సాయిరాజ్ నాయకులు శ్రీనివాస్, నారాయణ, రాజేందర్, అశోక్‌రెడ్డి, ఈశ్వర్ లచ్చన్న పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి


ఈడీ రాజశేఖర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

జైపూర్: ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాగా ప్రతి కార్మికుడికి రూ.10 వేలు చెల్లించాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఏటా సింగరేణి సంస్థ సాధించే లాభాల్లో ఎస్టీపీపీ నుంచి వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుందని నిరంతరం విద్యుత్ ఉత్పత్తికి కష్టపడుతున్న కార్మికులకు బోనస్ చెల్లించాలని కోరగా ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కట్నం వేధింపులకు వివాహిత బలి


లహరి మృతదేహం

జైపూర్: అదనపు వరకట్నం వేధింపులకు వివాహిత బలైంది. మండలంలోని ఇందారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. ఇందారం గ్రామానికి చెందిన రమేశ్‌తో నస్పూర్‌కు చెందిన ఇండ్ల లహరి (21)కి 2021లో వివాహమైంది. వీరికి 18 నెలల పాప ఉంది. పెళ్లయిన కొంతకాలానికి భర్త రమేశ్, అత్తారింటివారు కట్నం కోసం ఆమెను వేధించసాగారు. పెళ్లిలో తక్కువ కట్నం ఇచ్చారని అదనంగా మరో రూ.2 లక్షలు తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేశారు. వేధింపులు భరించలేక లహరి సోమవారం ఇందారంలోని ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: చదువుకోవడం ఇష్టం లేక విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని వెంగ్వాపేటకు చెందిన సాద అభి (17) నిజామాబాద్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. గత 15 రోజుల క్రితం బంధువుల అంత్యక్రియలకు వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. రెండు, మూడుసార్లు కళాశాలకు వెళ్లమని కుటుంబ సభ్యులు చెప్పినా అభి వినలేదు. సోమవారం తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన అభి.. గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నటున్ల పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బేల: మండలంలోని జూనోని గ్రామానికి చెందిన గుర్నులే మధుకర్ (35) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మధుకర్ గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రేణుక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటవీ భూములు సాగుచేసిన ఐదుగురి రిమాండ్


రిమాండ్‌కు తరలిస్తున్న వారితో అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా శివారులో అటవీభూములు సాగు చేస్తున్న ఐదుగురిని అటవీ అధికారులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. సెక్షన్ అధికారి మోహన్ కథనం ప్రకారం.. ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని బందెపల్లి బీట్‌లో దిందా గ్రామానికి చెందిన నికాడె సుశీల, డోకె మాంతయ్య, మడె నారాయణ, ధన్నూరి రాజేశ్, దంద్రె శేఖర్‌లు అటవీ భూమి సాగు చేశారు. 178, 179 కంపార్ట్‌మెంట్లలో 7 ఎకరాల భూమిలో చెట్లు నరికి, అటవీ భూమిని ఆక్రమించుకుని కంచెలు వేసుకున్నారు. సమాచారం అందడంతో అధికారులు.. ఐదుగురిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. వీరిని సిర్పూర్(టి) సివిల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి..15 రోజుల రిమాండ్ విధించారని సెక్షన్ అధికారి తెలిపారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా ఇన్‌చార్జిగా లక్ష్మణ్


లక్ష్మణ్

జన్నారం: మున్నూరు కాపు సంఘం నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా జన్నారం మండలం బాదంపల్లి గ్రామానికి చెందిన కాసెట్టి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం అపెక్స్ కౌన్సిల్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తంరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. జన్నారం మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న లక్ష్మణ్ సేవలు గుర్తించి ఈ పదవి అప్పగించారు. తనకు బాధ్యతలు అప్పగించిన నాయకులకు ఈ సందర్భంగా లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌వో మీనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలకు ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డు, పాస్‌ఫొటోతో రావాలని సూచించారు. కోచ్ అరవింద్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 9866395859, 9550909870 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

కౌటాల: మండలంలోని గుండాయిపేటకు చెందిన రైతు మండొగాడే పత్రు తన భార్యతో కలిసి పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుండాయిపేటకు చెందిన మండొగాడే పత్రు, ఎల్ములే బాబురావులకు ఐదెకరాల భూమి సంబంధించి గత కొంతకాలంగా వివాదం నడుస్తుంది. ఇటీవల బాబురావు ఐదెకరాల్లో పత్తి సాగు చేయగా.. ఈ భూమి తనదనని మండొగాడే పత్రు.. పత్తి పంటపై గడ్డి మందుతో పిచికారీ చేశాడు. పంటకు నష్టం జరిగిందని బాబురావు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులు ఇటీవల పంటను పరిశీలించారు. బాబురావు సాగుచేస్తున్న భూమి తనదేనని, తనకు అధికారులు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పత్రు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతామని తహసీల్దార్ పుష్పలత తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న విలేకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: అమాయక ప్రజలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న పట్టణానికి చెందిన విలేకరి కనుకుంట్ల వెంకట్రాజ్ అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన గంగిరెడ్డి రాజేశంను వెంకట్రాజ్ రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.5 వేలు ఫోన్ పే చేశాడు. ఇంకా డబ్బులు కావాలని వేధించాడు. బొమ్మ శ్రీనివాస్‌రెడ్డి తన సొంత భూమిలో మొరం తవ్వుతుండగా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నాయిని తిరుపతి పండ్ల వ్యాపారి షెడ్డు నిర్మిస్తుండగా అక్రమంగా వేస్తున్నారని బెదిరించి రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ. 31 వేలు ఇచ్చాడు. గుర్రం సుధాకర్ చికెన్ సెంటర్ నిర్మిస్తుండగా అతని నుంచి రూ.5 వేలు వసూలు చేశాడు. విలేకరి ముసుగులో ప్రజలను భయపెడుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడని సదరు యాజమానుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వెంకట్రాజ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై తదితరులు పాల్గొన్నారు.